E-KABURU
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
(తేదీ) 22-07-2025 (వారం) మంగళవారం
హైదరాబాద్ పేజీలు–6
e-kaburu.com



ఈడీ అన్ని పరిమితులు దాటుతోంది » 2లో



## జస్టిస్ వర్మ అభిశంసన ప్రక్రియ ఆరంభం

» తీర్మానాలపై 152 మంది లోక్‌సభ సభ్యులు, 63 మంది రాజ్యసభ సభ్యుల సంతకాలు
» ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక చర్చకు లోక్‌సభలో 16 గంటలు
» పార్లమెంటు సమావేశాల తొలిరోజే అంతరాయాలతో వాయిదా

తరువాయి 2లో

# అంజయ్య నగర్ లో మరో 'సీజ్' డ్రామా..

## ఈ 'సీజ్'ఫైర్ గత భవనాల మాదిరేనా..?

- నకిలీ పట్టాలపై కేసులు నమోదైనా ఆగని నిర్మాణం
- పార్కును ఆక్రమించి నిర్మించిన భవనాలను సీజ్ చేసిన జిహెచ్ఎంసి
- పూర్తయిన భవనాలను సీజ్ చేసి చేతులు దులుపుకున్న అధికారులు







నకిలీ పట్టాల కేసు నమోదు సమయంలో భవనం నాడు - నేడు

ఈకబురు, శేరిలింగంపల్లి : "కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉంది మన జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహార శైలి.. అక్రమ నిర్మాణాలను ఆదిలోనే గుర్తించి అడ్డుకోవలసిన టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణాలు మొత్తం పూర్తయ్యే వరకు వేచి ఉండి సీజ్ పేరుతో కొత్త డ్రామాకు తెరలేపుతున్నారు. అధికారులు సీజ్ చేసి వెళ్లిన గంటల వ్యవధిలోనే సీజ్ బ్యానర్లు, తాళాలు మూలకు పడుతుండగా, అక్రమ భవనాలు అంగరంగ వైభవంగా గృహప్రవేశాలు చేసుకుంటున్నాయి.. అదనపు అంతస్తులు, అనుమతులు లేని అక్రమ నిర్మాణాల సంగతి దేవుడెరుగు... ఏకంగా పట్టపగలు నకిలీ పట్టాలతో పార్కును కబ్జా చేసి నిర్మించిన భవనాల నిర్మాణాన్ని సైతం అధికారులు అడ్డుకోలేదు. నకిలీ పట్టాలపై రాయదుర్గం పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదైనా నిర్మాణాలు మాత్రం ఆగలేదు. చివరికి తప్పదన్నట్టు పూర్తయిన భవనాలను సీజ్ చేస్తున్నట్లు చడీ చప్పుడు లేకుండా బ్యానర్లు కట్టిన జిహెచ్ఎంసి అధికారులు, తాము చెమటోడ్చి పనిచేసినట్టు జబ్బలు చరుచుకున్నారు. కానీ అధికారులు వెళ్లిన గంటల వ్యవధిలోనే సీజ్ బ్యానర్లకు ముసుగులు పడగా.. అక్రమ భవనాల లోపల షరా మాములుగా పనులు కొనసాగుతుండడం విశేషం."

తరువాయి 3లో



## ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా

తరువాయి 2లో



## బరాక్ ఒబామా అరెస్టు!

తరువాయి 3లో



## 20 నెలల కాంగ్రెస్ పాలనలో 20 పైసలంత మేలూ జరగలేదు

తరువాయి 3లో

ఫండ్స్ రికవర్ చేస్తే 25%మీకే.. కాయిన్‌డీసీఎక్స్ ప్రకటన » 4లో



హృదయం నిశ్శబ్దంగా బద్దలైంది.. మెహ్రీన్ సెన్సేషనల్ పోస్ట్ » 5లో



వయసు పెరిగిందేమో కానీ, గుండెల్లో చేవ మాత్రం చావలేదు: పవన్‌కల్యాణ్ » 5లో



లార్డ్స్‌లో ఓటమి తీరని బాధించింది. » 5లో





» 2లో

## విజయోత్సవాలుగా పార్లమెంటు సమావేశాలు

## కలెక్టర్లు కదలాలి



» జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిందే
» ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
» వర్షా కాలం సమస్యల పరిష్కారానికి రూ.కోటి చొప్పున కలెక్టర్ల ఖాతాలకు.. రైతులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా
» ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
» కావాల్సినంత యూరియా ఉంది.. రైతులు ఆందోళన చెందొద్దు
» 25 నుంచి ఆగస్టు 10 వరకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామన్న సీఎం
» వర్షా లు, పంటల సాగు, వ్యాధులు, రేషన్‌కార్డుల పంపిణీపై సమీక్ష

ఈ కబురు, హైదరాబాద్: కలెక్టర్లు ఆయా జిల్లాల పరిధిలో ఆకస్మిక తనిఖీలు జరపాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిరోజు ఉదయం ఏడు గంటల నుంచే క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలని చెప్పారు. తద్వారా మిగతా అధికారులు కూడా అప్రమత్తమవుతారని సూచించారు. కలెక్టర్లతో పాటు ఇతర ఐఏఎస్‌లు, అదనపు కలెక్టర్లు కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ల కార్యాచరణకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతిరోజూ ప్రభుత్వానికి నివేదిక అందించాలని చెప్పారు. సీఎంఓలోని ఒక్కో అధికారికి రెండేసి ఉమ్మడి జిల్లాల బాధ్యతలు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీలుగా కలెక్టర్ల ఖాతాలో కోటి రూపాయలు చొప్పున అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, వానాకాలం పంటల సాగు, సీజనల్‌వ్యాధులపై అప్రమత్తత, రేషన్‌కార్డుల పంపిణీలో పురోగతి తదితర అంశాలపై సోమవారం ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

తరువాయి2లో



## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి!

» రేవంత్ సర్కార్ మోసాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లండి
» బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

ఈ కబురు: స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని, నియోజకవర్గ స్థాయిలో ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సీనియర్ నేతలు పాల్గొనాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ చేస్తోన్న మోసాలతో పాటు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ అవినీతి, అప్రజాస్వామిక విధానాలను గ్రామగ్రామాన ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో యూరియా, విత్తనాల కొరత తీవ్రంగా ఉన్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో పాటు రైతుబంధు ఇవ్వకుండా అన్నదాతలకు చేస్తోన్న ద్రోహాన్ని కూడా ప్రజలకు వివరించాలన్నారు.

తరువాయి 2లో



## కమ్యూనిస్టు యోధుడు అచ్యుతానందన్ కన్నుమూత

» 3లో

## దశాబ్ది తర్వాత రేషన్ కార్డుల పంపిణీ

» 2లో



ఈ-కబురు
22-07-2025
మంగళవారం
e-kaburu.com

మొదటి పేజీ తరువాయి

# జస్టిస్ వర్మ అభిశంసన ప్రక్రియ ఆరంభం



ఈ కబురు,దిల్లీ: అధికారిక నివాసంలో కాలిన నోట్లకట్టలు పెద్దఎత్తున లభ్యమైన నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించే తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ పార్లమెంటు ఉభయసభల్లో ఎంపీలు నోటీసులు ఇచ్చారు. సోమవారం వర్షాకాల సమావేశాలు మొదలుకాగానే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు 152 మంది ఎంపీలు తమ సంతకాలతో నోటీసు సమర్పించారు. రాజ్యసభలో 63 మంది సభ్యులు ఇలాంటిదానిని ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు సమర్పించారు. లోక్‌సభ సభ్యులూ నోటీసు ఇచ్చిన విషయాన్ని న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ ధ్రువీకరించిన తర్వాత ధన్‌ఖడ్ స్పందిస్తూ జడ్జి అభిశంసనకు ఉభయసభల్లో ఒకేరోజు నోటీసులు వచ్చినప్పుడు సభాపతులిద్దరూ కలిసి ఒక కమిటీని నియమించాల్సి ఉంటుందని, ఆ మేరకు తదుపరి చర్యల్ని సెక్రటరీ జనరల్ చేపడతారని చెప్పారు. అలహాబాద్ హైకోర్టుకు చెందిన జస్టిస్ శేఖర్ యాదవ్ తొలగింపునకు ఎంపీలు గత డిసెంబరులో ఇచ్చిన
నోటీసుపై ఒక సభ్యుడి సంతకం రెండుసార్లు ఉందని పరిశీలనలో తేలినట్లు తెలిపారు. రెండోసారి సంతకం చేయలేదని ఆ సభ్యుడు చెప్పినందువల్ల అన్ని సంతకాల వాస్తవికతను ధ్రువీకరించే ప్రక్రియ కొనసాగుతోందని, అది తేలాక సభకు విషయాన్ని తెలియజేస్తానని చెప్పారు.
తాజా నోటీసుపై కాంగ్రెస్, తెదేపా, జేడీయూ, జేడీఎస్, ఎన్‌సీపీఎస్‌పీ, డీఎంకే, ఆర్‌ఎస్‌పీ, జనసేన, ఏజీపీ, ఎల్‌జేఎస్‌పీ, ఎస్‌కేపీ, సీపీఎం తదితర పార్టీల ఎంపీలు సంతకాలు చేశారు. లోక్‌సభ విపక్షనేత రాహుల్ గాంధీ, వివిధ పార్టీల ఎంపీలు అనురాగ్ సింగ్ ఠాకుర్, రవిశంకర్ ప్రసాద్, రాజీవ్ ప్రతాప్ రూడీ, పీపీ చౌధరీ, సుప్రియా సూలె, కె.సి.వేణుగోపాల్, టి.ఆర్. బాలు తదితరులు జడ్జి అభిశంసన తీర్మానం కోసం సంతకాలు చేసినట్లు సమాచారం. న్యాయవ్యవస్థలో అవినీతి అనేది అతి సున్నితమైన, తీవ్రమైన అంశమని, అందువల్లనే జస్టిస్ వర్మను తొలగించే విషయంలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు.

**ట్రంప్ మాటలు.. దేశానికి అవమానం: ఖర్గే**

భారత్‌పాక్ ఘర్షణను నిలువరించేందుకు మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతుండటం దేశానికి అవమానకరమని రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే అన్నారు. శూన్యగంటలో విపక్షాల నిరసన తర్వాత సభ కొంతసేపు వాయిదా పడింది. ప్రశ్నోత్తరాల కోసం తిరిగి సమావేశమైనప్పుడు ఖర్గే, మరికొందరు సభ్యులు వాయిదా తీర్మాన నోటీసులు ఇచ్చారు. మిగతా వ్యవహారాలను పక్కనపెట్టి ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని పట్టుబట్టారు. పూర్తిస్థాయి చర్చకు అవకాశమిస్తానని ధన్‌ఖడ్ భరోసా ఇచ్చారు. ఆ తర్వాత కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు.

**అన్ని అంశాలకూ అనుమతిస్తా: స్పీకర్**

లోక్‌సభలోనూ ఇదే అంశంపై ప్రతిష్టంభన నెలకొంది. స్వల్ప విరామాలతో నాలుగుసార్లు సభను వాయిదా వేయాల్సి వచ్చింది. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత అన్ని అంశాలు లేవనెత్తేందుకు అనుమతిస్తానని, నిబంధనల ప్రకారమే సభ నడుస్తుందని స్పీకర్ చెప్పారు. నోటీసు ఇస్తే అన్ని అంశాలూ లేవనెత్తేందుకు అనుమతిస్తానన్నారు.ఆపరేషన్ సిందూర్, పహల్గాం దాడిపై లోక్‌సభలో ప్రత్యేక చర్చకు 16 గంటల సమయాన్ని కేటాయించాలని సభా వ్యవహారాల సంఘం సమావేశంలో నిర్ణయించారు.

పహల్గాం ఉగ్రదాడి, ఎయిరిండియా విమాన ప్రమాదాల్లో మృతులకు, ఇటీవలి కాలంలో చనిపోయిన మాజీ సభ్యులకు పార్లమెంటు నివాళులర్పించింది. రాజ్యసభకు కొత్తగా ఎంపికైన నలుగురు సభ్యులు ప్రమాణం చేశారు. నౌకాయాన పత్రాలను సరళతరం చేసే లాడింగ్ బిల్లు2025ని రాజ్యసభ ఆమోదించింది. మార్చిలోనే లోక్‌సభ దీనిని ఆమోదించింది.

మొదటి పేజీ తరువాయి

# కలెక్టర్లు కదలాలి: సీఎం రేవంత్



**అజాగ్రత్తగా ఉంటే ఉపేక్షించేది లేదు..**

'వర్షాల నేపథ్యంలో జిల్లాల పరిధిలో సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటల నీటిని జాగ్రత్తగా ఒడిసి పట్టుకోవాలి. జూలై, ఆగస్టు నెలల్లో కురిసే వర్షాలతో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణ శాఖ అందించే వర్ష సూచనలపై కనీసం మూడు గంటల ముందే రైతులు, ప్రజలను అప్రమత్తం చేసే వీలుందిఈ విషయంలో కలెక్టర్లు బాధ్యత వహించాలి. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. పిడుగు పాటు మరణాలను నమోదు చేస్తే భవిష్యత్తులో వారికి ప్రభుత్వ పరంగా సాయం అందించే వీలుంటుంది. వర్షాల సమయంలో జీహెచ్ఎంసీ పరిధిలో ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అన్ని విభాగాలు మరింత సమర్థంగా పని చేయాలి. ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేలా జీహెచ్ఎంసీతో పాటు పోలీస్, ట్రాఫిక్ విభాగాలు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా అధ్వర్యంలోని 150 టీమ్‌లు వెంటనే రంగంలోకి దిగాలి. అజాగ్రత్తగా ఉంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు..' అని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

**అంటు వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం**

'వర్షాకాలంలో డెంగీతో పాటు సీజనల్ జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ జాగ్రత్తలు తీసుకోవాలి. గిరిజన ప్రాంతాలు, ఏజెన్సీ ఏరియాలు, మారుమూల ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండాలి.

**యూరియా పక్కదారి పడుతోంది..**

కృష్ణా బేసిన్ పరిధిలో ఇప్పటికే కొన్ని ప్రాజెక్టుల కింద నీటి విడుదల మొదలైంది. త్వరలోనే నాగార్జునసాగర్ నీటిని కూడా విడుదల చేస్తాం. గోదావరి పరిధిలో వర్షాలు తక్కువగా ఉన్నందున కొంత ఆలస్యమవుతుంది. సబ్సిడీతో కూడిన యూరియా పూర్తిగా రైతులకు మాత్రమే చెందాలి. కానీ 20 నుంచి 25 శాతం యూరియా పక్కదారి పడుతున్నట్లు తెలిసింది. యూరియాను డీజిల్‌లో పొగను తగ్గించడానికి వాడుతున్నట్లు తెలిసింది. ఇతర వ్యాపార అవసరాలకు కూడా యూరియాను మళ్లిస్తున్నట్లు ఇటీవల కేంద్రమంత్రి హెచ్చరించారు. దీనిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ఈ సీజన్‌లో ఆగస్టు వరకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. యూరియా నిల్వ వివరాలను డీలర్లు, షాపుల వద్ద బోర్డుపై ప్రదర్శించాలి. అధికారులు బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టాలి. నిల్వల వివరాలు ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అన్నిచోట్ల డీలర్ల వద్ద, షాపుల వద్ద ఇద్దరు అధికారులు, ఇద్దరు పోలీసులను అందుబాటులో ఉంచాలి. ఎరువులకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలి..' అని సీఎం ఆదేశించారు.

**కార్డుల పంపిణీలో మంత్రులు, కలెక్టర్లు పాల్గొనాలి**

'కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా ప్రారంభమైంది. రాష్ట్రంలో దాదాపు 7 లక్షల కొత్త కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో దాదాపు 31 లక్షల కుటుంబ సభ్యులు లబ్ధి పొందుతారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ. ప్రస్తుతం రాష్ట్రంలో 96.95 లక్షల కార్డులతో 3.10 కోట్ల మంది సన్న బియ్యం తీసుకుంటున్నారు. పేదలకు సన్న బియ్యం అందించే ఈ రేషన్ కార్డుల పంపిణీని రాష్ట్రమంతటా ఘనంగా నిర్వహించాలి. ఈ నెల 25వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలి. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఈ కొత్త కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలి. డిజిటల్ కార్డులు రావడానికి ఆలస్యం అవుతుంది కాబట్టి ప్రింటెండ్ కార్డుల ద్వారా ప్రతి మండలంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు కూడా పాల్గొనాలి. జిల్లాలో ఉన్న ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒకచోట జిల్లా ఇన్‌చార్జి మంత్రి పాల్గొనాలి..' అని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, సీఎస్ కె.రామకృష్ణారావు తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కొత్తగూడెం నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఖమ్మం నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

# విజయోత్సవాలుగా పార్లమెంటు సమావేశాలు



ఈ కబురు: 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటు వర్షా కాల సమావేశాల్లో జరిగే చర్చలో పాలక కూటమి ఎంపీల వైఖరి ఏ విధంగా ఉండాలో ప్రధాని మోదీ ఉద్బోధించారు. ఈ సమావేశాలను విజయోత్సవాలుగా అభివర్ణించారు. ఈ సెంటిమెంటును పార్లమెంటు సభ్యులు ఏకకంఠంతో తెలియజేయాలని సూచించారు. సోమవారం ఉదయం సమావేశాలు ప్రారంభమవుతాయనగా పార్లమెంటు ప్రాం గణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశాలు గర్వించదగినవన్నారు. 'జాతికి ఇది విజయోత్సవం.ఆపరేషన్ సిందూర్‌తో మన సాయుధ బలగాల సామర్థ్యాన్ని ప్రపంచం కళ్లారా చూసింది. లక్ష్యాలను అవి నూరు శాతం సాధించాయి. మన బలగాలు ఆపరేషన్ సిందూర్‌తో కేవలం 22 నిమిషాల్లో ఉగ్రవాద బాస్‌లను వారి ఇళ్లలోనే భూస్థాపితం చేశాయి. మేడిన్ ఇండియా ఆయుధాల సత్తాను సిందూర్ చాటిచెప్పింది. మన ఆయుధ శక్తి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దేశంలో ప్రస్తుతం పలు సానుకూల పరిణామాలు నెలకొన్నాయి. నక్సలిజం శరవేగంగా అంతరిస్తోంది. రెడ్‌జోన్ హరిత వృద్ధి జోన్‌గా మారుతోంది. చాలా జిల్లాలు నక్సలిజం గుప్పిట నుంచి బయటకు వచ్చాయి. స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారతీయ పతాకం రెపరెపలాడుతోంది' అని తెలిపారు. ఉగ్రవాదుల యజమాని పాకిస్థాన్ ముసుగు తొలగించేందుకు అఖిల పక్ష ఎంపీలు ప్రపంచ దేశాలను సందర్శించి.. ఆపరేషన్ సిందూర్ అసలు లక్ష్యాన్ని వివరించేందుకు చేసిన కృషిని మోదీ అభినందించారు. రాజకీయ పార్టీలకు వేర్వేరు ఎజెండాలు ఉంటాయని..అయితే జాతీయ ప్రయోజనాలు ఇమిడి ఉన్న అంశాల్లో ఐకమత్యం అవసరమని సూచించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత దేశంలో ఐక్యతను తాను చూశానన్నారు.

మొదటి పేజీ తరువాయి

# దశాబ్ది తర్వాత రేషన్ కార్డుల పంపిణీ

**పదేళ్లు రేషన్ కార్డుల ఊసే ఎత్తని బీఆర్ఎస్**

**రాష్ట్రంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి పరుగులు: భట్టి**



ఈ కబురు: పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వారు ప్రజలకు రేషన్ కార్డుల పంపిణీని పట్టించుకోలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కానీ, రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం కొలువురిన తర్వాత అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నదని చెప్పారు. సోమవారం ఆయన ఖమ్మం జిల్లా బోనకల్, చింతకాని మండలాల్లో పర్యటించారు. బోనకల్ మండల కేంద్రంలో జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ కార్డుల పంపిణీ నిరంతరం సాగిందని, తిరిగి తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన కొద్దికాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 93 లక్షల కుటుంబాలకు ఆహార భద్రత కార్డులను పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు.
గృహలక్ష్మి పథకం కింద 51 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. పేద పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రవేశ పెడుతున్నట్లు చెప్పారు. చింతకాని మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద దళిత బంధు రెండోవిడతలో రూ.4.63 కోట్లతో 214 మంది లబ్ధిదారులకు మంజూరైన యూనిట్లను మల్లు భట్టి విక్రమార్క పంపిణీ చేశారు. మిగతా లబ్ధిదారులకూ త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. దళిత బంధు యూనిట్ల క్రయవిక్రయాలు నేరమని, వాటితో కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని హితవు చెప్పారు. అంతకు ముందు మండలంలోని గాంధీనగర్‌లో ఒక లబ్ధిదారుడి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భట్టి విక్రమార్క భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు త్వరిగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. జోరువానలోనూ ఆయన చింతకాని, గాంధీనగర్‌ల్లో పర్యటించడం విశేషం.

# ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా



ఈ కబురు: పార్లమెంటు వర్షాకాల సమావేశాల వేళ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. వైద్య పరమైన కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపిన లేఖలో ఆయన పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన రోజే ధన్‌ఖడ్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 2022 ఆగస్టులో ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ''ఆరోగ్య సంరక్షణతో పాటు వైద్యుల సలహాలను పాటించేందుకు వీలుగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నాను. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది. నా పదవీ కాలంలో మద్దతుగా నిలిచిన రాష్ట్రపతి, ప్రధాని, పార్లమెంటు సభ్యులందరికీ కృతజ్ఞతలు. వారి నుంచి లభించిన అమూల్యమైన సహకారం, ఆప్యాయతలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. పదవీకాలంలో ఎన్నో విలువైన విషయాలు నేర్చుకున్నాను. అనేక అనుభవాలను మూటగట్టుకున్నాను. ఈ పరివర్తనాత్మక సమయంలో ఉపరాష్ట్రపతిగా.. దేశ ఆర్థిక పురోగతిని, అభివృద్ధిని గమనించే అవకాశం రావడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. ఇది నాకు సంతృప్తినిచ్చింది. ప్రపంచ వేదికపై భారత్ విజయాల పట్ల గర్విస్తున్నాను. దేశ ఉజ్వల భవిష్యత్తుపై అచంచలమైన విశ్వాసం ఉంది'' అని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు

**న్యాయవాద వృత్తిలోంచి రాజకీయాల్లోకి...**

రాజస్థాన్ ఓబీసీ జాట్ సామాజిక వర్గానికి చెందిన ధన్‌ఖడ్.. మూడు దశాబ్దాలుగా ప్రజాజీవితంలో ఉన్నారు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన దేశంలోనే రెండో అత్యున్నత స్థానానికి ఎదిగారు. 1951 మే 18న రాజస్థాన్‌లోని ఝున్‌ఝును జిల్లా కిథనా గ్రామంలో జగదీప్ ధన్‌ఖడ్ జన్మించారు. ఎల్ఎల్‌బీ కోర్సు తర్వాత 1979 నవంబరులో రాజస్థాన్ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. రాజస్థాన్ హైకోర్టు, సుప్రీంకోర్టులలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 1989లో జనతాదళ్ తరఫున ఝున్‌ఝును లోక్‌సభ స్థానం నుంచి ధన్‌ఖడ్ గెలిచారు. 1990లో అప్పటి ప్రధాని చంద్రశేఖర్ క్యాబినెట్‌లో పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రిగా స్వల్పకాలం పనిచేశారు. 199398 మధ్య కాలంలో ఎమ్మెల్యేగా ఉన్నారు. పి.వి. నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో కాంగ్రెస్‌లో చేరారు. 1998 నుంచి క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటూ న్యాయవాద వృత్తిలో కొనసాగారు. 2008 తర్వాత భాజపా గూటికి చేరిన ధన్‌ఖడ్... 2019లో అనూహ్యంగా పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యారు.ఈ క్రమంలోనే 2022లో ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అధికార ఎన్డీయే కూటమి ఆయనను తమ అభ్యర్థిగా రంగంలోకి దింపింది. విపక్షాల అభ్యర్థి మార్గరెట్ ఆళ్వాపై 346 ఓట్ల తేడాతో విజయం సాధించారు. భారత 14వ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు.అయితే, ఈ ఏడాది మార్చిలో ఆయన ఛాతీ నొప్పి, అసౌకర్యంతో దిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. జూన్‌లోనూ ఉత్తరాఖండ్‌లోని కుమావు విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవంలో స్పృహతప్పి పడిపోయారు. ఈ క్రమంలోనే తన ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఆయన ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

# 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడం అసాధ్యం



ఈ కబురు, దిల్లీ: తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును ముందస్తు న్యాయ సమీక్ష లేకుండా రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడం సాధ్యం కాదని భాజపా తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు స్పష్టం చేశారు. 9వ షెడ్యూల్‌తో ముడిపెట్టకుండా రాష్ట్ర సర్కారే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భాజపా తెలంగాణ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి దిల్లీకొచ్చిన ఆయన సోమవారం ఇక్కడి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ''రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్న కాంగ్రెస్ డిమాండ్ హాస్యాస్పదం. 9వ షెడ్యూల్‌లో చేర్చే ఏ అంశమైనా న్యాయసమీక్షకు లోబడే ఉంటుందని 1973లో కేశవానంద భారతి కేసులో, 2007లో ఐఆర్ కోయెల్హో వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. తమిళనాడు రిజర్వేషన్ల అంశం ఇప్పటికీ కోర్టు ముందుంది. ఈ విషయం తెలిసీ 42% రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేయడం ఓబీసీ సమాజాన్ని తప్పుదారి పట్టించడమే. ప్రభుత్వ ప్రకటన వెనుక ఎన్నికలు నిర్వహించకూడదన్న కుట్ర దాగుంది. మధ్యప్రదేశ్‌లో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని, జనాభాను బట్టి 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేశారు. తెలంగాణ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అదే తరహాలో అమలు చేయాలి. బీసీఈ కింద ముస్లింలకు విద్య, ఉద్యోగాల్లో కల్పిస్తున్న రిజర్వేషన్లను రాజకీయాలకు విస్తరింపజేస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తాం'' అని రామచందర్‌రావు స్పష్టంచేశారు. బండి సంజయ్, ఈటల మధ్య నెలకొన్న విభేదాలను కుటుంబ అంతర్గత సమస్యగా కొట్టిపారేశారు. రేవంత్‌కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కవితకేటీఆర్ ఇలా అన్ని పార్టీల్లోనూ సమస్యలున్నాయని చెప్పారు. ఎవరు క్రమశిక్షణ తప్పినా పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి!



రేవంత్ పాలనలో గ్రామాల్లో అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యం గురించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ పార్టీ వైఖరి గురించి ప్రజలకు విడమిర్చి చెప్పాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటాలు, నిరసన కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచేసేలా పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ సూచించారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న ''గిఫ్ట్ ఎ స్మైల్'' కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన సుస్మిత అనే పేద విద్యార్థినికి ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డా.చంద్రశేఖర్, డా. ప్రణయవాణి దంపతులు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు కేటీఆర్ వారిని అభినందించారు.

**యాక్టివాలో నాగుపాము**

**స్కూటీపై నుంచి దూకేసిన రైడర్**

స్కూటీపై వెళ్తున్న ఓ రైడర్‌కు షాకింగ్ అనుభవం ఎదురైంది. అంబర్‌పేటలోని పటేల్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి సోమవారం ఉదయం యాక్టివా స్కూటీపై ఆజాద్‌నగర్ మీదుగా అలీకేఫ్ చౌరస్తా వైపునకు వెళ్తున్నాడు. ఆజాద్‌నగర్ మదర్సా వద్దకు రాగానే అప్పటికే స్కూటీలో ఉన్న నాగుపాము ఆకస్మాత్తుగా అతడి చేతిపైకి ఎక్కింది. భయంతో వెంటనే స్కూటీని వదిలేసి కిందకు దూకేశాడు. అయితే, కిందపడిన పాము మళ్లీ యాక్టివాలోకి దూరింది. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. దాదాపు రెండు గంటల పాటు శ్రమించి, స్కూటీ భాగాలను విప్పి ఆ పామును సురక్షితంగా బయటకు తీశాడు. అదృష్టవశాత్తు, పాము కాటు వేయకపోవడంతో సదరు వ్యక్తికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

# ఎన్నికల్లో జపాన్ ప్రధానికి ఎదురుదెబ్బ

ఈ కబురు,టోక్యో: జపాన్ ప్రధానమంత్రి షిగేరు ఇషిబా నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం పార్లమెంటు ఎగువసభలో మెజారిటీ కోల్పోయింది. సభలో 248



స్థానాలుండగా, వాటిలో సగం సీట్లకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) సభలో మెజారిటీ సాధించాలంటే 50 స్థానాలు దక్కించుకోవాలి. కానీ 47 స్థానాలకే పరిమితమైంది. గత అక్టోబరులో జరిగిన దిగువసభ ఎన్నికల్లోనూ ఈ కూటమి ఓటమి పాలైంది. 1955లో స్థాపించిన ఎల్‌డీపీ రెండు సభల్లో మెజారిటీని కోల్పోవడం ఇదే తొలిసారి. ప్రతికూలంగా ఫలితాలొచ్చినా తాను పదవిలో కొనసాగుతానని ఇషిబా తెలిపారు. ఈ ఓటమితో రాజీనామా చేయాలని లేదా కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయాలని అధికార కూటమిలోని ఇతర రాజకీయ పార్టీల నుంచి ఇషిబాపై ఒత్తిడి వచ్చే అవకాశాలున్నాయి.

మొదటి పేజీ తరువాయి

# అంజయ్య నగర్ లో మరో 'సీజ్' డ్రామా..


పార్కు స్థలంలో వెలిసిన భవనాన్ని అధికారులు సీజ్ చేసిన దృశ్యం


సీజ్ బ్యానర్ కనిపించకుండా ఏర్పాటు చేసిన పరదా


సీజ్ చేసిన భవనంలో కొనసాగుతున్న పనులు


జిహెచ్ఎంసి అధికారులు సీజ్ చేసిన మరో భవనం

హైటెక్ మండలం శేరిలింగంపల్లిలోని సర్వే నెంబరు 134,136లలో గల గచ్చిబౌలి అంజయ్యనగర్ ఏపీహెచ్బీ లేఅవుట్ లో 1.20 ఎకరాల పార్కు స్థలం కబ్జాకు గురైంది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 58,59 నకిలీ పట్టాలను సృష్టించిన కబ్జాదారులు దాదాపు 100 కోట్ల రూపాయల విలువైన పార్కు స్థలాన్ని కబ్జా చేసి విక్రయించారు. జిహెచ్ఎంసి అనుమతులతో నిర్మాణాలు చేపడుతుండడంతో జనం కోసం స్వచ్ఛంద సంస్థ పార్కు ఆక్రమణపై పోరాటానికి దిగింది. దీనిపై అధికారులు దర్యాప్తు చేపట్టగా నకిలీ పట్టాల విషయం వెలుగు చూసింది. అప్పటికే కబ్జాదారులు సదరు స్థలంలో ఒక అంతస్తు నిర్మాణం చేపట్టడంతో నాటి శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు జనవరి 27వ తేదీన రాయదుర్గం పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. నకిలీ పట్టాల వ్యవహారంపై శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు సైతం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై అప్పట్లోనే రాయదుర్గం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. మరోవైపు జిహెచ్ఎంసి సర్కిల్ అధికారులు సదరు భవన నిర్మాణ అనుమతులు రద్దు చేయాలంటూ హెడ్ ఆఫీస్ కు విన్నవించారు.

**పనులు అడ్డుకోకుండా కాలయాపన...**

నకిలీ పట్టాలతో జిహెచ్ఎంసి అనుమతులు పొందారని స్వయంగా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన రెవెన్యూ, జిహెచ్ఎంసి అధికారులు పార్కు స్థలంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల పనులను మాత్రం అడ్డుకోలేదు. కేసులు నమోదైనా లెక్కచేయని కబ్జాదారులు యదేచ్ఛగా తమ నిర్మాణాలను కొనసాగించారు. నిబంధనలకు విరుద్ధంగా కేవలం 200 గజాల విస్తీర్ణంలో 6 అంతస్థుల భవన నిర్మాణాలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు నిర్మాణ పనులను అడ్డుకోకపోవడం, జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో భవన నిర్మాణం మొత్తం పూర్తయింది. ఈ భవనాలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అధికారులు లెక్కచేయలేదు.


నకిలీ పట్టాల కేసు నమోదు సమయంలో భవనం నాడు - నేడు

**అక్రమ భవనాల సీజ్...**

నిర్మాణం మొత్తం పూర్తయిన మూడు భవనాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గత రెండు రోజుల క్రితం జిహెచ్ఎంసి సర్కిల్ అధికారులు సదరు భవనాలను సీజ్ చేశారు. నకిలీ పట్టాలతో అంజయ్య నగర్ పార్కు స్థలంలో వెలసిన బహుళ అంతస్తుల భవనాలకు సీజ్ చేస్తున్నట్లు బ్యానర్లు పెట్టి, తాళాలు వేశారు. కాగా ఈ సీజ్ వ్యవహారంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణం జరగకుండా అడ్డుకోవలసిన అధికారులు, నిర్మాణం మొత్తం పూర్తయిన తర్వాత సీజ్ పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారని స్థానికులు వాపోతున్నారు. గతంలో అంజయ్య నగర్, సిద్ధిక్ నగర్ లలో 26 భవనాలను సీజ్ చేయగా.. ప్రస్తుతం మొత్తం భవనాలు వ్యాపార కేంద్రాలుగా మారాయంటున్నారు. ఇదే తరహాలో ప్రస్తుతం సీజ్ చేసిన పార్కు స్థలంలో వెలిసిన అక్రమ భవనాలు సైతం అతి త్వరలో వాణిజ్య సముదాయాలుగా మారుతాయని, అధికారులు చేపట్టిన సీజ్ వ్యవహారం ప్రజలను మభ్య పెట్టేందుకేనని స్థానికులు వాపోతున్నారు.

**సీజ్ బ్యానర్లకు ముసుగు.. కొనసాగుతున్న పనులు..**

చడి, చప్పుడు లేకుండా పార్కు స్థలంలో వెలసిన అక్రమ భవనాలను అధికారులు సీజ్ చేసి, బ్యానర్లు కట్టి, తాళాలు వేసి వెళ్లగా... సీజ్ చేసిన కొన్ని గంటల్లోనే సీజ్ బ్యానర్లకు ముసుగు పడింది. ఓవైపు గేటుకు సీజ్ తాళాలు ఉండగా, మరోవైపు భవనం లోపల యదేచ్ఛగా పనులు కొనసాగుతూ ఉండడం అధికారుల సీజ్ వ్యవహారంపై అనుమానాలను రేకెత్తిస్తుంది. సీజ్ బ్యానర్లపై పరదాలు వేసి విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్న నిర్మాణదారులు భవనం లోపల మాత్రం యదేచ్ఛగా ఫినిషింగ్ పనులు చేపడుతున్నారు. గతంలో శేరిలింగంపల్లిలో సీజ్ చేసిన భవనాలపై ప్రకటన విడుదల చేసిన సర్కిల్ అధికారులు, తాజాగా ఈ భవనాల సీజ్ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

## 20 నెలల కాంగ్రెస్ పాలనలో 20 పైసలంత మేలూ జరగలేదు



**ఈ కబురుగ: '20 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు 20 పైసలంత మేలైనా జరగలేదు. పైగా రెండింతల విధ్వంసం చోటుచేసుకుంది' అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో సోమవారం నిర్వహించిన భారత రాష్ట్ర సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. "అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్న రాష్ట్రం.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అధోగతి పాలైంది. ఆ వైఫల్యాలను ప్రతి కార్యకర్తా ప్రజలకు తెలియజెప్పాలి. సర్వేలన్నీ మనకే అనుకూలంగా ఉన్నాయి. మెజారిటీ జిల్లా పరిషత్‌లను భారత రాష్ట్ర సమితి గెలవడం ఖాయం. కాంగ్రెస్ ప్రభుత్వం.. మొదటి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని 12 వేలే ఇచ్చి నిరుద్యోగులను మోసం చేసింది. నిరుద్యోగ భృతి కోసం ఈ ప్రభుత్వాన్ని అడిగితే కేసులు పెడుతున్నారు. మల్లన్నసాగర్‌లోకి కాళేశ్వరం నీళ్లు ఇంకా విడుదల చేయడం లేదు. తెలంగాణలో ఒక ఎకరం అమ్మితే, ఆంధ్రాలో 10 ఎకరాలు కొనొచ్చు అని చంద్రబాబు ఓ సందర్భంలో అన్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితి తలకిందులైంది. ప్రస్తుతం ఇక్కడ 2 ఎకరాలు అమ్మినా.. ఆంధ్రాలో ఒక ఎకరా కొనలేని పరిస్థితి ఉంది' అని హరీశ్‌రావు వెల్లడించారు. కేసీఆర్ వేయించిన రోడ్లపై ఏర్పడ్డ గుంతలు పూడ్చలేని.. ప్రజలకు తాగునీళ్లు ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో ఓట్లడిగే హక్కు లేదని ధ్వజమెత్తారు.**

# ఫలహారం బండి మహోత్సవంలో పాల్గొన్న రవికుమార్ యాదవ్


ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న రవికుమార్ యాదవ్

- తెలంగాణ సంస్కృతిలో భాగం బోనాల ఉత్సవాలు : రవికుమార్ యాదవ్

ఈకబురు, శేరిలింగంపల్లి : బోనాల పండుగను పురస్కరించుకొని నిర్వహించే ఫలహారం బండి ఊరేగింపు మహోత్సవంలో సోమవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి ఎం.రవి కుమార్ యాదవ్ పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని తారా నగర్ పోచమ్మ దేవాలయం, తుల్జా భవాని దేవాలయం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో రవికుమార్ యాదవ్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవని, బోనాల పండుగ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతిలో భాగమన్నారు. కష్టాలు దరిచేరకుండా కాపాడమంటూ గ్రామ దేవతలను వేడుకుంటూ బోనాల ఉత్సవాలు నిర్వహించుకోవడం అనాదిగా వస్తున్న సాంప్రదాయమన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.


ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న రవికుమార్ యాదవ్

మొదటి పేజీ తరువాయి

# బరాక్ ఒబామా అరెస్టు!

ఈ కబురు: అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా లక్ష్యంగా.. ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ వివాదాస్పద చర్యకు పాల్పడ్డారు. ఒబామాను పోలీసులు అరెస్టు చేస్తున్నట్లు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా సృష్టించిన వీడియోను ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్' సోషల్'లో పోస్ట్ చేశారు. ట్రంప్, ఒబామా ఇద్దరూ వైట్‌హౌస్‌లో కూర్చుని ముచ్చటించుకుంటుండగా.. ఎఫ్‌బీఐ పోలీసులు అక్కడికి వచ్చి ఒబామా రెక్కలు విరిచి బేడీలు వేసినట్లు, ట్రంప్ కాళ్ల వద్ద ఒబామా పడిపోయినట్లు ఈ వీడియోను సృష్టించారు. ఒబామాను అరెస్టు చేస్తుంటే ట్రంప్ చిరునవ్వులు చిందిస్తున్నట్లుగా వీడియోలో కనిపిస్తుంది. పైగా, 'చట్టానికి ఎవరూ అతీతులు కాదు' అన్న వ్యాఖ్య కూడా వీడియోలో కనిపిస్తుంది. అనంతరం ఒబామా ఖైదీ దుస్తుల్లో జైల్లో కటకటాల వెనక ఉన్నట్లుగా చిత్రీకరించారు. 2016 ఎన్నికల సమయంలో ట్రంప్ అధ్యక్షుడు కాకుండా అడ్డుకునేందుకు, ఎన్నికయ్యాక ఆయన పాలనను నియంత్రించేందుకు ఒబామా ప్రయత్నించారంటూ అమెరికా జాతీయ నిఘా డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ ఇటీవల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా ట్రంప్ ఎన్నికలో రష్యా ప్రమేయం ఉందన్నట్లుగా ప్రచారం చేసినట్లు ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ ఈ వీడియోను పోస్ట్ చేయడం సంచలనంగా మారింది. ట్రంప్ చర్యను నెటిజన్లు తప్పుబట్టారు. అయితే లైంగిక నేరస్తుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్ సంబంధాలు కొనసాగించినట్లుగా వార్తలు వస్తున్న వేళ.. దాని నుంచి దృష్టి మరల్చేందుకే ట్రంప్ ఈ చర్యకు దిగారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# కమ్యూనిస్టు యోధుడు



## అచ్యుతానందన్ కన్నుమూత

ఈ కబురు, తిరువనంతపురం: స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాతా ప్రజాపోరాటాల్లో ఆరితేరిన కమ్యూనిస్టు యోధుడు, జీవితాంతం శ్రామికజనుల పక్షపాతిగా నిలిచిన కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్(101) కన్నుమూశారు. గత నెల 23న గుండెపోటు రాగా తిరువనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం 3.20 గంటలకు తుదిశ్వాస విడిచారు. భూసంస్కరణలు, సామాజిక న్యాయంతో పాటు సమాజంలోని వివిధ అసమానతల నిర్మూలన కోసం నిరంతరం పోరాడిన వామపక్ష నేత ఆయన. ఐదేళ్లపాటు కేరళ ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఏడుసార్లు ఎన్నికయ్యారు. రెండు దఫాలు శాసనసభలో విపక్ష నేతగా కొనసాగారు. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) లో చీలిక రాగా సీపీఎంను స్థాపించిన 32 మంది కీలక నేతల్లో అచ్యుతానందన్ ఒకరు. కేరళలో ఆ పార్టీకి బలమైన ప్రజాపునాదిని నిర్మించడంలో ముఖ్య భూమికను పోషించారు. 1923 అక్టోబరు 20న కేరళలో ఓ నిరుపేద కుటుంబంలో జన్మించిన అచ్యుతానందన్...ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రలో అనేక కీలకఘట్టాలను చూసిన అత్యంత అరుదైన నేత. నిరాడంబర జీవితం గడిపిన ఆయన నీతి, నిజాయతీలకు మారుపేరుగా నిలిచారు. సమాజంలోని అక్రమాలనే కాదు సొంత పార్టీలో అపసవ్య పోకడలనూ నిర్మొహమాటంగా నిలదీశారు. అచ్యుతానందన్‌కు భార్య వసుమతి, కుమారుడు అరుణ్‌కుమార్, కుమార్తె ఆశా ఉన్నారు. వీఎస్ మృతి పట్ల సీపీఎం తీవ్ర విచారం వ్యక్తంచేసింది. పార్టీ వ్యవస్థాపకుల్లో చిట్టచివరి నేతను కోల్పోయామని పేర్కొంది. కమ్యూనిస్టు ఉద్యమాలతో ఎనిమిదిన్నర దశాబ్దాల సుదీర్ఘ అనుబంధం ఆయనకుందని తెలిపింది. గౌరవ సూచికంగా పార్టీ పతాకాన్ని అవనతం చేస్తున్నట్లు తెలిపింది. వీఎస్ కుటుంబ సభ్యులకు సంతాపం చెబుతూ సీపీఎం పొలిట్‌బ్యూరో ప్రకటన వెలువరించింది. నిబద్ధత కలిగిన అరుదైన రాజకీయ నేత అచ్యుతానందన్ అని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఆయన మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తదితరులు సంతాపం తెలిపారు. దేశ రాజకీయాల్లో మచ్చలేని మహానేత వీఎస్ అచ్యుతానందన్ అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయనకు నివాళిఅర్పించారు.

ఉద్యమాలే ఊపిరి...

వి.ఎస్.అచ్యుతానందన్ జీవితం ఆద్యంతం పోరాటాలే కనిపిస్తాయి. బాల్యంలో పేదరికంతో, యుక్త వయసులో ఆంగ్లేయ పాలకులతో, స్వాతంత్ర్యం అనంతరం భూసంస్కరణల కోసం, అవినీతికి వ్యతిరేకంగా నిర్విరామంగా సమరం సాగించారు. వందేళ్ల వయసులోనూ శరీరంలో సత్తువ ఉన్నంత వరకూ కార్మిక హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం గొంతెత్తి నినదించారు. ముక్కుసూటి తనం వల్ల సొంత పార్టీలోనూ ఇబ్బందులెదురైనా వెనకడుగు వేయలేదు. రాజకీయాలా, ప్రజాప్రయోజనమా... అనే ప్రశ్న తలెత్తినప్పుడు ప్రజల పక్షపాతిగా నిలిచేందుకే ఇష్టపడ్డారు. పార్టీలోనూ, తెలిసిన వారు ఆయనను ఆప్యాయంగా వీఎస్ అని పిలుచుకుంటారు. బాల్యంలో పేదరికం కారణంగా ఏడో తరగతి వరకే అచ్యుతానందన్ విద్యాభ్యాసం కొనసాగింది. దర్జీ దుకాణంలో సహాయకుడిగా, కొబ్బరి పీచు కార్మికుడిగా జీవనం సాగించారు. మరోవైపు దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారు. 16ఏళ్ల వయసు (1939)లో స్టేట్ కాంగ్రెస్‌లో చేరారు. ఆ మరుసటి ఏడాదే కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. ట్రావెన్‌కోర్ సంస్థానంలో కొనసాగిన భూ పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆ క్రమంలో ఐదున్నరేళ్ల పాటు జైలు జీవితం గడపాల్సి వచ్చింది.

సీపీఎం బలోపేతానికి కృషి

1964లో ఏర్పాటైన సీపీఎం కేరళలో గట్టి పునాదులతో నిలదొక్కుకునేలా చేసేందుకు వీఎస్ అవిశ్రాంత కృషి చేశారు. 1967 నుంచి ఏడుసార్లు కేరళ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2006 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతటా సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ విజయ బావుటా ఎగుర వేసినా...మరారికుళం స్థానంలో అచ్యుతానందన్‌కు పరాజయం ఎదురైంది. కంచుకోటలాంటి ఆ నియోజకవర్గంలో వీఎస్ ఓటమి అందరినీ నివ్వెరపరిచింది. సొంత పార్టీలోని ఓ వర్గం ద్రోహానికి పాల్పడిందనే అభిప్రాయం వ్యక్తమయ్యింది. ఆయన రాజకీయ జీవితం ముగిసిపోతుందని పలువురు భావించారు. అయితే, ప్రజలు, పార్టీ శ్రేణుల ఒత్తిడితో ముఖ్యమంత్రి పదవి అచ్యుతానందన్‌ను వరించింది. 2011 వరకూ ఆ పదవిలో కొనసాగారు.

కేరళ అభివృద్ధికి ఎనలేని కృషిచేసిన అచ్యుతానందన్: సీఎం

కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కార్మిక ఉద్యమాల నుంచి ప్రముఖ ప్రజానాయకుడిగా ఎదిగారని..సీఎంగా ఉన్న కాలంలో కేరళ అభివృద్ధికి ఎనలేని కృషిచేశారని పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఈడీ అన్ని పరిమితులు దాటుతోంది



ఈ కబురు,ఢిల్లీ: కక్షిదారులకు చట్టపరమైన సలహాలిచ్చే న్యాయవాదులకు దర్యాప్తు సంస్థలు సమన్లు జారీ చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అన్ని పరిమితులను దాటుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయవాదులకు సమన్లు ఎలా జారీ చేస్తారని ప్రశ్నించింది. సీనియర్ న్యాయవాదులు అరవింద్ దతార్, ప్రతాప్ వేణుగోపాల్‌లకు ఈడీ..సమన్లు జారీ చేయడంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం మండిపడింది. న్యాయవాదులకు, క్లయింట్లకు మధ్య జరిగే సంభాషణ చాలా ప్రత్యేకమైందని, దానికి నోటీసులివ్వడం తమను విస్మయానికి గురిచేసిందని పేర్కొంది. ఓ మనీలాండరింగ్ కేసులో కక్షిదారులకు న్యాయసలహా ఇచ్చిన న్యాయవాదులు అరవింద్ దతార్, ప్రతాప్ వేణుగోపాల్‌లకు ఇటీవల ఈడీ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు సోమవారం విచారణ నిర్వహించింది. ఈ అంశంపై తాము మార్గదర్శకాలు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. కేంద్రం తరఫున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా న్యాయస్థానం అభిప్రాయంతో ఏకీభవించారు. రాజకీయ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఈడీ తరఫున వాదించే న్యాయవాదులు ఈ అంశాన్ని రాజకీయం చేయకూడదని సీజేఐ పేర్కొన్నారు. తదుపరి విచారణను కోర్టు ఈనెల 29కి వాయిదా వేసింది.




# అవీవా కొత్త పాలసీ.. బాల వికాస్ యోజన




**న్యూఢిల్లీ:** అవీవా ఇండియా నూతనంగా అవీవా భారత్ బాల వికాస్ యోజన పేరుతో బీమా ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఇది ఈక్విటీ మార్కెట్‌తో సంబంధం లేని, నాన్ పార్టిసిపేటింగ్ జీవిత బీమా ప్లాన్. తమ పిల్లల భవిష్యత్ భద్రతకు ఇది భరోసానిస్తుందని కంపెనీ తెలిపింది. ప్రీమియం నెలకు రూ.1,000 నుంచి మొదలవుతుంది. జీవిత బీమా రక్షణకుతోడు హామీతో కూడిన మెచ్యూరిటీ ప్రయోజనం కూడా ఇందులో భాగంగా ఉంటుంది. 3 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసు పరిధిలోని వారు.. 12-30 ఏళ్ల కాలానికి తీసుకోవచ్చు. గరిష్ట కాల వ్యవధి పాలసీదారుడికి 80 ఏళ్ల వరకు ఉంటుంది.

నెలవారీ, త్రైమాసికం లేదా అర్ధ సంవత్సరం లేదా ఏడాదికోసారి ప్రీమియం చెల్లింపు ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. గ్యారంటీడ్ సమ్ అష్యూర్డ్ పేరుతో కాల వ్యవధి ముగిసిన తర్వాత చెల్లించే ప్రయోజనం పిల్లల భవిష్యత్ అవసరాలకు ఆర్థిక భరోసానిస్తుందని కంపెనీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ వినీత్ కపాహి తెలిపారు.



# దేశంలో తొలి ఏఐ ఆధారిత డిజిటల్ హెల్త్ సెంటర్

**అగిలిసియం సీఈఓ రాజ్ బాబు, శ్రీ రామచంద్ర ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఉమాశేఖర్**



**చెన్నై:** ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలో ఒక ప్రధాన అడుగు పడింది. దేశంలో తొలి ఏఐ ఆధారిత డిజిటల్ హెల్త్ సెంటర్ ఏర్పాటు కానుంది. ఇందు కోసం లైఫ్ సైన్సెస్ పై దృష్టి సారించిన ఏఐ కంపెనీ అజిలిసియం, శ్రీ రామచంద్ర ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి.

మెరుగైన రోగ నిర్ధారణ, వ్యక్తిగతీకరించిన చికిత్స, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ కోసం ఏఐ ఆధారిత సాధనాలను అభివృద్ధి చేయడం, డెసిషన్ సపోర్ట్ సిస్టమ్స్, డిజిటల్ ట్విన్స్, స్మార్ట్ హాస్పిటల్ టెక్ వంటి డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్ రూపొందించడం క్లినికల్ డేటా నాణ్యత, ఇంటర్ ఆపరేబిలిటీ, పరిశోధన సంసిద్ధతను మెరుగుపరచడానికి క్లీన్ హెల్త్ డేటా ఇనిషియేటివ్‌ను క్రియేట్ చేయడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యాలు.

ఒప్పందంలో భాగంగా ఏఐ టూల్స్, జీఎన్ఏఐ, డేటా సైన్స్, అనలిటిక్స్ వంటివి అగిలిసియం సంస్థ సమకూర్చనుండగా రామచంద్ర ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ క్లినికల్ డేటా సెట్లు, డొమైన్ నిపుణులు, ఆసుపత్రి వాతావరణం వంటివి కల్పించనుంది. వీటితోపాటు అకడమిక్ సహకారంలో భాగంగా హెల్త్ కేర్ లో జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై సర్టిఫికేట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనుంది. ఔషధ ఆవిష్కరణ, రోగనిర్ధారణ, రోగి సంరక్షణలో భవిష్యత్తు ప్రతిభకు శిక్షణ ఇవ్వనుంది.



# ఫండ్స్ రికవర్ చేస్తే 25%మీకే.. కాయిన్ డీసీఎక్స్ ప్రకటన

**ఢిల్లీ:** దేశీయ క్రిప్టోకరెన్సీ ఎక్స్చేంజీ 'కాయిన్‌డీసీఎక్స్' బౌంటీ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. సైబర్ దాడిలో సుమారు 44.2 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.378 కోట్లు) పోగొట్టుకున్న ఆ సంస్థ.. రికవరీకి చర్యలు చేపట్టిందది. ఇందులో భాగంగా సొమ్ము రికవరీలో సహకరించిన వారికి రాబట్టిన మొత్తంలో 25 శాతం వరకు రివార్డుగా ఇస్తామని వెల్లడించింది. ఈ మేరకు ఎథికల్ హ్యాకర్స్, వైట్‌హ్యాట్ రీసెర్చర్లు, ఇతర భాగస్వాములకు సోమవారం పిలుపునిచ్చింది. అంతేకాదు సైబర్ క్రైమ్‌పై వెబ్3 కమ్యూనిటీ పోరాడాలని సూచించింది.

కాయిన్‌డీసీఎక్స్‌లో ఈనెల 19న ఉదయం 4 గంటలకు సైబర్ దాడి చోటు చేసుకుంది. భాగస్వామి ఎక్స్చేంజీలోని తమ ఖాతాల్లో, ఒకదాంట్లో ధ్రువీకరణ లేని చొరబాటు జరిగిందని కాయిన్‌డీసీఎక్స్ భద్రతా వ్యవస్థలు గుర్తించాయి. ఈ ఘటనలో దాదాపు రూ.378 కోట్ల నష్టం వాటిల్లింది. వినియోగదారుల నిధులు భద్రంగా ఉన్నాయని, వీటిపై ఎటువంటి ప్రభావం పడలేదని సంస్థ సహవ్యవస్థాపకులు సుమిత్ గుప్తా, నీరజ్ ఖండేల్‌వాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రకటించారు. సైబర్ దాడి వల్ల నష్టపోయిన మొత్తాన్ని కాయిన్‌డీసీఎక్స్ భరిస్తుందని, అంతర్గత నిల్వలను ఇందుకు వినియోగిస్తుందని కంపెనీ తెలిపింది. గతేడాది క్రిప్టో ఎక్స్చేంజీ వజీర్‌ఎక్స్‌లో కూడా 230 మి.డాలర్ల సైబర్ చోరీ జరిగిన విషయం తెలిసిందే.

# ఇన్‌స్టా స్క్రోలింగ్ ఆపి ఏఐ టూల్స్‌పై దృష్టి పెట్టండి.. యువతకు పర్‌ప్లెక్సిటీ సీఈవో సూచన

**ఇన్‌స్టాగ్రామ్‌లో నిరంతరం స్క్రోలింగ్ చేయడం తగ్గించి, దానికి బదులుగా ఏఐ టూల్స్ వినియోగంలో ప్రావీణ్యం సంపాదించడంపై దృష్టి పెట్టాలని పర్‌ప్లెక్సిటీ సీఈవో అరవింద్ శ్రీనివాస్ యువతకు (Gen Z) సూచించారు. ఇటీవల ప్రముఖ టెక్ జర్నలిస్ట్ మాథ్యూ బెర్మాన్‌తో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐని సరిగా ఉపయోగించడం తెలిసిన వారికి జాబ్ మార్కెట్‌లో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు.**



వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత ఏఐ యుగంలో మూడు నుంచి ఆరు నెలల వ్యవధిలోనే భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని శ్రీనివాస్ అన్నారు. దాంతో పోటీ పడకపోతే ఉద్యోగ అవకాశాల పరంగా వెనకబడిపోతామని పేర్కొన్నారు. ''సాంకేతికతతో పాటు వృద్ధి చెందడం అంతతేలికైన పని కాదు. ఇప్పటివరకూ చూసుకుంటే మానవాళి ఇలా పెద్ద స్థాయిలో మార్పులకు త్వరగా సర్దుబాటు కాలేదనడానికి ఉదాహరణలెన్నో ఉన్నాయి'' అని శ్రీనివాస్ అన్నారు.

**ఏఐతో రిక్రూటర్ల స్థానం భర్తీ**

ప్రముఖ టెక్ మీడియా సంస్థ 'ది వెర్జ్' డీకోడర్ పాడ్‌కాస్ట్ తాజా ఎపిసోడ్‌లో శ్రీనివాస్ మాట్లాడుతూ.. పర్‌ప్లెక్సిటీకి చెందిన ఏఐ కామెట్ బ్రౌజర్ మానవ రిక్రూటర్ల పనిని పూర్తిగా భర్తీ చేసే స్థాయికి ఎదగవచ్చని అభిప్రాయపడ్డారు. ''ఒక రిక్రూటర్ వారం రోజుల పాటు చేసే పని, ఒక్క మంచి ప్రాంప్ట్‌తోనే పూర్తవుతుంది. సదరు అభ్యర్థుల వివరాలు సేకరించడం, వారికి మెయిల్ పంపించడం, వారి స్పందనలను ట్రాక్ చేయడం, గూగుల్ షీట్‌లో స్టేటస్ అప్‌డేట్ చేయడం, ఫాలోఅప్‌లు ఇవ్వడం, గూగుల్ క్యాలెండర్‌తో సింక్ చేయడం, మీటింగ్‌కు ముందు బ్రీఫింగ్ పంపడం.. ఇవన్నీ ఆటోమేటిక్‌గా జరగాలి. ఇదే వచ్చే తరంలోని ఏఐ టూల్స్ లక్ష్యం'' అని చెప్పారు. ప్రస్తుతం కామెట్ బ్రౌజర్‌ను పెర్‌ప్లెక్సిటీ సబ్‌స్క్రిప్షన్ ఉన్న వినియోగదారులకే పరిమితం చేశారు. త్వరలో ఫ్రీ యూజర్లకు కూడా ఆహ్వానాలు పంపడం ప్రారంభించినట్లు సంస్థ ప్రకటించింది.

ఎవరీ అరవింద్ శ్రీనివాస్: అరవింద్ శ్రీనివాస్ భారతీయ యువ పారిశ్రామికవేత్త, కంప్యూటర్ సైంటిస్ట్. పెర్‌ప్లెక్సిటీ ఏఐ సంస్థకు సహ వ్యవస్థాపకుడు, సీఈఓ. 1994 జూన్ 7న చెన్నైలో జన్మించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్, ఎంటెక్ డిగ్రీలు పొందారు. తర్వాత యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు.





# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి హెవీవెయిట్స్ నుంచి బలమైన క్యూ1 రాబడుల నేపథ్యంలో భారత ఈక్విటీ బెంచ్ మార్క్ సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఇండెక్స్ 442.61 పాయింట్లు లేదా 0.54 శాతం పెరిగి 82,200.34 స్థాయిలలో స్థిరపడగా, నిఫ్టీ 50 122.3 పాయింట్లు లేదా 0.49 శాతం పెరిగి 25,090.7 స్థాయిలలో ముగిసింది.**

నిఫ్టీ మిడ్ క్యాప్ 100 0.66 శాతం లాభపడగా, పెర్సిస్టెంట్ సిస్టమ్స్, యూపీఎల్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్, నేషనల్ అల్యూమినియం, బీఎస్ ఈ, బీడీఎల్, పాలసీబజార్, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, సుజ్లాన్, అశోక్ లేలాండ్ షేర్లు లాభపడ్డాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ ప్రతికూల ప్రభావంతో ఫ్లాట్ గా స్థిరపడింది.రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంక్, మెటల్ 1 శాతానికి పైగా లాభపడి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. బ్యాంక్ షేర్లలో ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.7 శాతం వరకు లాభపడ్డాయి. నిఫ్టీ, ఆటో, ఎనర్జీ, రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్, మీడియా షేర్లు లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్, ఐటీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.

సెన్సెక్స్ లోని 30 షేర్లలో 18 షేర్లు గ్రీన్‌లో ముగిశాయి. ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్ 5.4 శాతం వరకు లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్సీఎల్ టెక్, హిందుస్థాన్ యూనిలీవర్, టీసీఎస్, మారుతీ సుజుకీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. మార్కెట్ ఒడిదుడుకులను అంచనా వేసే ఇండియా వీఐఎక్స్ 1.67 శాతం క్షీణించి 11.20 పాయింట్ల వద్ద స్థిరపడింది.

# ఎంజీ ఎం9 ఎలక్ట్రిక్ లిమోసిన్ విడుదల: ధరెంతో తెలుసా..!

**విద్యుత్తు కార్ల మార్కెట్లో పోటీని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ మరో మెట్టు పైకెక్కించింది. భారత్‌లో విలాసవంతమైన ఎం9 కారును తక్కువ ధరకే అందుబాటులోకి తెచ్చి సంచలనం సృష్టించింది. ఈ కారు ప్రారంభ ఆఫర్ ధర (ఎక్స్‌షోరూమ్) రూ.69.90 లక్షలుగా ప్రకటించింది. దీని డెలివరీలు ఆగస్టు 10 నుంచి ప్రారంభిస్తామని సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం రూ. లక్ష చెల్లించి ఎంజీ సెలక్ట్ వెబ్‌సైట్‌లో లేదా 13 నగరాల్లో ఏర్పాటు చేసిన ఎక్స్‌క్లూజీవ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లలో బుక్ చేసుకోవచ్చు.**



**బ్యాటరీ.. రేంజి..!**

ఎం9లో 90 కిలోవాట్ అవర్ ఎన్ఎంసీ బ్యాటరీని అమర్చారు. ఇది ఒక సారి ఫుల్‌ఛార్జింగ్ చేస్తే 548 కిలోమీటర్ల రేంజి ఇస్తుంది. ఈ కారు మోటార్ 245 బీహెచ్‌పీ శక్తి, 350 ఎన్ఎం టార్క్‌ను విడుదల చేస్తుంది. దీనిలో 11 కిలోవాట్స్ వాల్‌బాక్స్ చార్జర్, 3.3 కిలోవాట్స్ పోర్టబుల్ ఛార్జర్‌ను ఇవ్వనుంది. ఇక హైఓల్టేజీ బ్యాటరీపై లైఫ్‌టైమ్ వారెంటీ, 3 ఏళ్లపాటు అన్‌లిమిటెడ్ కిలోమీటర్స్ వెహికల్ వారెంటీని ఇస్తుంది.

**లగ్జరీ ఇంటీరియర్..**

ఎం9 కారులో ఇంటీరియర్ విలాసవంతమైన బిజినెస్ క్లాస్‌ను తలపిస్తుంది. 16 రకాలుగా అడ్జస్ట్ చేసుకునే విధంగా ప్రెసిడెన్షియల్ సీట్‌స్‌ను దీనిలో అమర్చారు. వెంటిలేషన్, హీటింగ్, 8 మసాజ్ ఫంక్షన్స్ వంటి వాటిని ఇంటెలిజెంట్ ఆర్‌మ్‌రెస్ట్ సాయంతో నియంత్రించవచ్చు. ప్రీమియం క్వాలిటీ లెదర్ సీట్లు కారు అందాన్ని మరింత పెంచాయి. 13 స్పీకర్లతో సౌండ్ సిస్టమ్, 64 రంగుల యాంబియంట్ లైటింగ్, డ్యూయల్ యాట్చ్ స్టైల్ సన్‌రూఫ్, 1720 లీటర్ల స్టోరేజ్ దీనిని అత్యంత సౌకర్యవంతంగామార్చాయి. కారు బయటవైపు ట్రాపెజోడియల్ గ్రిల్, స్ప్లిట్ ఎల్ఈడీ హెడ్‌లైట్స్, వాటర్‌ఫాల్ స్టైల్ రియర్ ఎల్ఈడీ లైట్స్, 19 అంగుళాల కాంటీసీల్ సెల్ఫ్ సీలింగ్ టైర్లు అదనపు ఆకర్షణలుగా నిలిచాయి. ఈ కారు మెటల్ బ్లాక్, కాంక్రీట్ గ్రే, పెర్ల్ లస్ట్రే వైట్ రంగుల్లో లభ్యం కానుంది.

**సేఫ్టీ-స్మార్ట్ టెక్నాలజీ**

ఈ కారును అల్ట్రా హై స్ట్రెంత్ స్టీల్‌తో నిర్మించారు. ఈ శ్రేణి కార్లలో అత్యున్నత స్థాయి రక్షణ కల్పిస్తుంది. యూరోఎన్‌క్యాప్, ఏఎన్‌క్యాప్ రేటింగ్స్‌లో 5స్టార్ సాధించింది. ఏడు ఎయిర్ బ్యాగ్‌లు, అడాస్ లెవల్2, డ్రైవర్ మానిటరింగ్ సిస్టమ్ ఉన్నాయి. ఈ కారు కియా కార్నివాల్, టొయోటా వెల్‌ఫైర్, లెక్సస్ ఎల్ఎంతో పోటీ పడనుంది. కంపెనీ ఎండీ అనురాగ్ మెహరోత్రా మాట్లాడుతూ ''ఎంజీ ఎం9 కొత్త యుగానికి తెరతీసింది. భారత్‌లో లగ్జరీకార్ల డిమాండ్ పెరుగుదలకు ఇది చిహ్నంగా నిలిచింది'' అని అన్నాడు.

## 'ఇడ్లీ కడై' సినిమా ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చిన ధనుష్.. క్యూరియాసిటీ పెంచుతున్న పోస్టర్




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ ఓ వైపు వరుస సినిమాల్లో నటిస్తూనే మరోవైపు దర్శకత్వం వహిస్తూ ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. ప్రస్తుతం ధనుష్ స్వయం దర్శకత్వంలో రాబోతున్న లేటెస్ట్ మూవీ 'ఇడ్లీ కడై'. ఈ చిత్రంలో ధనుష్, నిత్యా మీనన్ జంటగా నటిస్తుండగా.. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇందులో అరుణ్ విజయ్, అశోక్ సెల్వన్, రాజ్‌కిరణ్, సత్యరాజ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ అక్టోబర్ 1న థియేటర్స్‌లోకి రాబోతుంది.

ఇప్పటికే ఇందులోంచి వచ్చిన పోస్టర్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. 'ఇడ్లీ కడై' నుంచి అప్డేట్స్ ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో.. తాజాగా, మూవీ మేకర్స్ అదిరిపోయే అప్డేట్ రాబోతున్నట్లు ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. త్వరలోనే మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్ సాంగ్ ఈ నెల 27న రాబోతున్నట్లు ఓ పోస్టర్‌ను కూడా షేర్ చేశారు. సెలబ్రేషన్స్ ప్రారంభం కాబోతున్నాయంటూ ధనుష్ స్పెడ్స్ పెట్టుకుని జాతరలో రంగులరాట్నం ముందు నిల్చుని ఉండగా.. ఆయన చుట్టూరా పిల్లలు కూడా అద్దాలతో ఫొటోకు పోజులిస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది.

## హృదయం నిశ్శబ్దంగా బద్దలైంది.. మెహ్రీన్ సెన్సేషనల్ పోస్ట్

బాలీవుడ్ సైయారా బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. థియేటర్స్ అన్నీ ఎమోషనల్ సీన్స్‌తో నిండిపోతున్నాయి. యూత్ చాలా మంది కథకు కనెక్ట్ అవుతూ.. కన్నీరు పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో తెలుగు హీరోయిన్ ఈ మూవీకి సంబంధించిన రివ్యూ ఇచ్చింది. 'సైయారా ఇప్పడే చూశాను, నిజంగా ఇంకా ఆ భావోద్వేగంలోనే ఉన్నాను. ఇది కేవలం సినిమా కాదు.. ఒక భావన. అద్భుతంగా తీర్చిదిద్దిన ఈ చిత్రం, నీ హృదయాన్ని నిశ్శబ్దంగా బద్దలు చేసి, మళ్లీ ఆ గాయాన్ని ఓదార్చే క్షణాలతో నిండి ఉంది. కథ, సంగీతం, నిశ్శబ్దం... ప్రతీ ఒక్కటీ సంపూర్ణంగా కుదిరింది. ఇది కేవలం ప్రేమకథ కాదు.. ఆసక్తి, విడిచిపెట్టడం, పట్టుకోవడం, మరొకరిలో నిన్ను గుర్తించడానికి సంబంధించింది. ఇంత హార్డ్‌గా నన్ను తాకుతుందని ఊహించలేదు. అందుకు నేను చాలా సంతోషిస్తున్నాను' అని చెప్పకొచ్చాడు.

# వయసు పెరిగిందేమో కానీ, గుండెల్లో చేవ మాత్రం చావలేదు



**హైదరాబాద్:** రికార్డులు కోసం తానెప్పుడూ సినిమాలు చేయలేదని, సగటు మనిషిగా బతుకుదామన్న ఆలోచన తప్ప తనకేమీ కోరికలూ లేవని అగ్ర కథానాయకుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తాను ఈ స్థాయిలో నిలబడటానికి అభిమానులే కారణమని తెలిపారు. ఆయన కథానాయకుడిగా నటించిన పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు' . క్రిష్, జ్యోతికృష్ణ దర్శకులు. నిధి అగర్వాల్ కథానాయిక. ఏఎం రత్నం నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 24న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక జరిగింది.

**న్యాయం కోసం నిలబడ్డాం..**

ఈ వేడుకలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ''ఇలాంటి వేడుక చేసుకోవాలంటే చాలా ఒత్తిడి ఉంటుంది. ఈ కార్యక్రమానికి అనుమతి ఇచ్చిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, పోలీసుశాఖ వారికి ధన్యవాదాలు. నేను రాజకీయాల్లోకి వచ్చాక మంచి స్నేహితుడిని సంపాదించుకున్నా. ఆయనే కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే. కర్ణాటక నుంచి ఈ కార్యక్రమానికి వచ్చినందుకు ధన్యవాదాలు. 'భీమ్లా నాయక్' విడుదలైనప్పుడు అందరి సినిమాల టికెట్‌లు రూ.100ల్లో ఉంటే.. పవన్ సినిమా టికెట్‌ను రూ.10, రూ.15 చేశారు. నేను ఒకటే చెప్పాను. 'మనల్ని ఎవడ్రా ఆపేది'. ఇది డబ్బు కోసమో.. రికార్డులు కోసమో కాదు.. ఇది ధైర్యం కోసం.. సాహసం కోసం.. న్యాయం కోసం నిలబడ్డాం. పవన్‌కల్యాణ్ ఎప్పుడూ రికార్డుల కోసం ప్రయత్నం చేయలేదు. సగటు మనిషిగా బతుకుదామన్న ఆలోచన తప్ప నేనేమీ కోరుకోలేదు. నేను ఇక్కడ ఈ స్థాయిలో నిలబడినా, రాజకీయాల్లో పడి లేచినా, కారణం మీరే (అభిమానులు). నా దగ్గర ఆయుధాల్లేవు, గూండాలు లేరు. గుండెల్లో అభిమానులే ఉన్నారు''

**ఆ ఫ్లాప్ ఇవ్వడమే నా పాపం..**

''చిత్ర పరిశ్రమకు వచ్చి దాదాపు 30ఏళ్లు అవుతోంది. వయసు పెరిగిందేమో కానీ, గుండెల్లో చేవ మాత్రం చావలేదు. 'గబ్బర్‌సింగ్' సినిమా సమయంలో ఒక హిట్ ఇవ్వమని ఓ అభిమాని అడిగాడు. అది హరీశ్ శంకర్ వల్ల తిరిగి వచ్చింది. ఈ సినిమా కూడా చాలా క్లిష్టమైన సమయంలో చేశా. 'జానీ' సినిమా ఫెయిల్ అయినా అభిమానులు వదల్లేదు. కానీ, అన్ని బంధాలూ డబ్బుతో ముడిపడి ఉంటాయి కదా! నా రెమ్యునరేషన్ తిరిగి ఇచ్చేశాను. నేనెప్పుడూ బంధాలకు ప్రాముఖ్యత ఇచ్చాను. ప్రధాని నుంచి అందరూ నాకు తెలుసు. కానీ, దాని వల్ల డబ్బులు రావు కదా. మిమ్మల్ని ఆనందింపజేయాలనే ఈ మూవీ చేశా. 'ఎప్పుడూ రీమేక్‌లు చేస్తా'వని అందరూ నన్ను తిడతారు. మనకేమీ పెద్ద పెద్ద దర్శకులు ఎవరూ లేరు. నేను చేసిన పాపం అప్పట్లో ఆ ఒక్క ఫ్లాప్ ఇవ్వడమే. మళ్లీ సినిమాపై నాకు గ్రిప్ దొరకలేదు. అప్పుడు నాకు అండగా నిలబడిన వ్యక్తి త్రివిక్రమ్. కష్టాల్లో ఉన్న నాతో 'జల్సా' మూవీ చేసి మంచి హిట్ ఇచ్చాడు''

**కీరవాణి మ్యూజిక్ లేకపోతే ఈ మూవీ లేదు..**

''కొత్త కథలు చేసే అవకాశం ఉన్నా, అది పోతే అందరం ఇబ్బంది పడతాం. అందుకే రీమేక్‌లు చేశా. ఎప్పటికైనా మంచి సినిమా చేయాలని కోరుకున్నా. సరిగ్గా ఆ సమయంలోనే జాగర్లమూడి క్రిష్ ఈ కథ చెప్పారు. ఇక 'నాటు నాటు' పాటతో ప్రపంచం ఉర్రూతలూగించారు కీరవాణి. ఆయన మ్యూజిక్ వింటే నాకు ఎంతో ఉత్సాహం వచ్చేది. ఈ సినిమా కోసం బలంగా, ఆత్మ విశ్వాసంతో ఉన్నామంటే కారణం ఆయనే. కీరవాణి మ్యూజిక్ లేకపోతే 'హరి హర వీరమల్లు' లేదు. గత నెల రోజులుగా నిధి అగర్వాల్ ఎన్నో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటోంది. ఆ అమ్మాయి వల్లే నేనూ ప్రెస్‌మీట్‌లలో పాల్గొంటున్నా''

**మళ్లీ మార్షల్ ఆర్ట్స్ సాధన చేశా..**

"హరి హర వీరమల్లు' ఆసక్తికర సబ్జెక్ట్. భారతదేశం ఎవరిపైనా దాడి చేయలేదు. మనపైనే అందరూ దాడి చేశారు. మన పుస్తకాల్లో అక్బర్, షాజహాన్, ఔరంగజేబులు గొప్ప అంటూ చెప్పారు. విజయనగర సామ్రాజ్యం గొప్పతనం గురించి చెప్పలేదు. ఔరంగజేబు చేసిన దుర్మార్గాలను చెప్పలేదు. అప్పట్లో హిందువుగా బతకాలంటే పన్ను కట్టాల్సి వచ్చేది. అలాంటి సమయంలో 'ఛత్రపతి' శివాజీ ధైర్యంగా పోరాటం చేశారు. అలా ధర్మం కోసం పోరాటం చేసిన ఒక కల్పిత పాత్రే 'హరిహర వీరమల్లు'. ఏపీలోని కొల్లూరులో కోహినూర్ వజ్రం దొరికింది. అది అలా అలా చేతులు మారి లండన్ మ్యూజియంలో ఉంది. క్రిష్ చెప్పిన ఆ కథ నాకు నచ్చింది. అందుకే ఈ సినిమా కోసం నాకున్న శక్తినంతా పెట్టాను. మీకోసం డ్యాన్స్‌లు కూడా చేశాను. రాజకీయాల్లోకి వచ్చాక రియల్ లైఫ్ గూండాలు, రౌడీలను ఎదుర్కొన్నా కానీ, సినిమాటిక్‌గా చేయడానికి కష్టపడాల్సి వచ్చింది. అందుకే ఎప్పుడో నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్ మళ్లీ సాధన చేసి, క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌కు దర్శకత్వం వహించా. ఈ మూవీ ఎన్ని కోట్లు కలెక్ట్ చేస్తుందో చెప్పలేను. మీరు కోరుకునే సక్సెస్ నేనూ కోరుకుంటున్నా. మీ నచ్చితే బాక్సాఫీస్ బద్దలు కొట్టేయండి. మీరే నా బలం. ఈ గుండె మీకోసమే కొట్టుకుంటుంది. మీ కష్టాలను తీర్చడానికి కొట్టుకుంటుంది. జై భారత్.. జై హింద్" అని పవన్ కల్యాణ్ అన్నారు.

## అందుకే నా పాత్రలు అంతగా నచ్చేశాయి

గత కొన్నేళ్లలో తీసుకుంటే సినిమాలు చాలావరకు తగ్గించేసిన సమంత.. ఓటీటీలపై పూర్తిగా దృష్టి పెట్టింది. పలు వెబ్ సిరీసుల్లో నటించింది. ఈ క్రమంలోనే తాజాగా అమెజాన్ ప్రైమ్ బ్రాండ్ క్యాంపెన్‌లో పాల్గొంది. తన ప్రయాణం అంతా రకరకాల భావోద్వేగాలతో నిండిందని చెప్పకొచ్చింది.

సమంత మాట్లాడుతూ.. ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్ హనీ బన్నీ తదితర సిరీసుల్లో తను పోషించిన పాత్రలని గుర్తు చేసుకుంది. ప్రతి పాత్ర ప్రేక్షకులు అనుభూతి చెందేలా, ఆ పాత్ర తాలూకు భావోద్వేగాలతో మమేకమయ్యేలా ఉంటాయని అందుకే అవి అంతగా వారికి చేరువ అయ్యాయని చెప్పింది. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న సామ్ సహనటుడు మనోజ్ బాజ్ పాయ్ కూడా ఆసక్తికర వ్యాఖ్యలుచేశాడు. ఫ్యామిలీ మ్యాన్‌లో తను పోషించిన పాత్రలోని భిన్న కోణాలు తనపై ఎంత ప్రభావం చూపించాయో మనోజ్ బాజ్ పాయ్ గుర్తుచేసుకున్నాడు.









## రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మికి ఈడీ నోటీసులు

బెట్టింగ్ యాప్స్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దూకుడు ప్రదర్శిస్తున్నారు. విచారణలో వేగం పెంచారు. తాజాగా సినీ నటులు రాణా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మిలకు నోటీసులు జారీ చేశారు. జులై 23న రాణా, 30వ తేదీన ప్రకాశ్ రాజ్, ఆగస్టు 6న విజయ్ దేవరకొండ, ఆగష్టు 13న మంచులక్ష్మిలు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వీరితో పాటు మెటా, గూగుల్ సంస్థలకూ ఈడీ నోటీసులు జారీ చేసింది. జులై 28న సంబంధిత ప్రతినిధులు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ బెట్టింగ్ యాప్‌లతో మనీలాండరింగ్, హవాలా లావాదేవీలు జరుగుతున్నట్లు ఆరోపణలు రావడంతో ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. అయినప్పటికీ.. గూగుల్, మెటా సంస్థలు ఇలాంటి యాప్‌లను తమ మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. ఈ టెక్ కంపెనీలు బెట్టింగ్ యాప్‌ల ప్రకటనలకు స్లాట్లు కేటాయించడమే గాక, వెబ్‌సైట్ల లింక్‌లను కూడా అందుబాటులో ఉంచుతున్నాయని ఈడీ పేర్కొంది.









# 2 నెలల్లో 17 కిలోల బరువు తగ్గి.. స్లిమ్‌గా మారిన సర్ఫరాజ్ ఖాన్

ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన భారత జట్టులో చోటు కోల్పోయిన బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్.. ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాడు. తిరిగి టీమ్‌ఇండియాలో స్థానం సంపాదించుకోవాలనే పట్టుదలతో ఉన్న సర్ఫరాజ్ అధిక బరువును తగ్గించుకునే పనిలో పడ్డాడు. ఇంతకుముందు బొద్దుగా ఉన్న అతను గత రెండు నెలల్లోనే 17 కిలోల బరువు తగ్గి స్లిమ్‌గా అయ్యాడు. ప్రత్యేక ఆహార నియమాలతోనే అతనిలా మారాడు. ఉడకబెట్టిన కూరగాయలు, చికెన్ మాత్రమే తింటున్న సర్ఫరాజ్.. గణనీయంగా బరువును తగ్గించుకున్నాడు. అతను 95 కిలోల నుంచి 78 కేజీలకు తగ్గినట్లు తెలుస్తోంది. తాను స్లిమ్‌గా మారినట్లు తెలియజేస్తూ జిమ్‌లో దిగిన ఫొటోలను సర్ఫరాజ్ ఇన్‌స్టా స్టోరీలో పంచుకున్నాడు. వీటిని చూసిన నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 'వావ్.. ఇలా సన్నగా మారిపోయాడా?'.. '2 నెలల్లో 17 కేజీల బరువు తగ్గడమా.. అద్భుతం!' అంటూ కామెంట్లు చేస్తున్నారు. 27 ఏళ్ల సర్ఫరాజ్ భారత్ తరఫున ఇప్పటివరకు 6 టెస్టులు ఆడి 371 పరుగులు చేశాడు. చివరగా గతేడాది నవంబర్‌లో వాంఖడే వేదికగా కివీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆడాడు.

## లార్డ్స్‌లో ఔటైన తీరు బాధించింది..

# మాంచెస్టర్ టెస్టులో బుమ్రా ఆడతాడు: సిరాజ్





**ఇంగ్లాండ్‌తో ఈ నెల 23 నుంచి మాంచెస్టర్‌లో జరగనున్న నాలుగో టెస్టులో జస్‌ప్రీత్ బుమ్రా ఆడతాడని మహ్మద్ సిరాజ్ తెలిపాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో బుమ్రా మూడు మ్యాచ్‌లే ఆడతాడని మేనేజ్‌మెంట్ గతంలోనే స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ఆడిన బుమ్రా.. నాలుగో టెస్టులో ఆడతాడా? లేదా అనే దానిపై చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మాంచెస్టర్ టెస్టులో బుమ్రా బరిలోకి దిగుతాడని సిరాజ్ ధ్రువీకరించాడు.**

'జస్సీ భాయ్ (బుమ్రా) ఆడతాడు. ఇప్పటివరకు నాకు అదే తెలుసు. కానీ, కాంబినేషన్ మారుతూనే ఉంటుంది. ఇంగ్లాండ్ బ్యాటింగ్ అటాక్‌ను దృష్టిలో ఉంచుకుని సాధ్యమైనంతవరకు సరైన ప్రదేశాల్లో బంతులు సంధించాలనుకుంటున్నాం. ఎందుకంటే ఇంగ్లాండ్ బ్యాటర్లు లార్డ్స్‌లో చాలా ఓపికతో బ్యాటింగ్ చేశారు. వారు ఎలా ఆడినా మా ప్రణాళిక మాత్రం ఇదే. లార్డ్స్ టెస్టులో నేను ఔటైన తీరు బాధించింది. ఆ మ్యాచ్‌లో మేం గెలిస్తే 21 ఆధిక్యంలో ఉండేవాళ్లం. జడ్డూ భాయ్ (రవీంద్ర జడేజా) ఎంతో పోరాడాడు. కానీ, సిరీస్ ఇంకా ముగియలేదని, బ్యాటింగ్‌పై దృష్టిసారిస్తానని నాకు నేనే చెప్పుకొన్నా. ఆస్ట్రేలియా పర్యటన నుంచి మేం (టెయిలెండర్లు) తీవ్రంగా కృషి చేస్తున్నాం. లార్డ్స్ టెస్టులో 22 పరుగుల తేడాతో ఓడిపోవడం తీవ్రంగా బాధించింది' అని సిరాజ్ వివరించాడు.

ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో ఇప్పటివరకు 3 మ్యాచ్‌లు ఆడిన సిరాజ్ 13 వికెట్లతో టాప్ వికెట్‌టేకర్‌గా ఉన్నాడు. బుమ్రా రెండు మ్యాచ్‌లు ఆడి 12 వికెట్లు తీశాడు. ఇక, ఇంగ్లాండ్ గడ్డపై సిరీస్ గెలవాలంటే మాంచెస్టర్ టెస్టులో టీమ్‌ఇండియా తప్పక గెలవాలి. ఓడినా లేదా డ్రా చేసుకున్నా సిరీస్ ఆశలు గల్లంతవుతాయి.

మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో రెండు స్టాండ్లకు భారత మాజీ వికెట్ కీపర్ ఫారూక్ ఇంజినీర్, వెస్టిండీస్ దిగ్గజ ఆటగాడు క్లైవ్ లాయిడ్ పేర్లను పెట్టనున్నారు. ఇంగ్లాండ్, భారత్ మధ్య నాలుగో టెస్టు మొదటి రోజు ఆట సందర్భంగా ఈ స్టాండ్స్ ఆవిష్కరించే అవకాశముంది. ఓల్డ్ ట్రాఫోర్డ్ లాంకషైర్ కౌంటీ క్రికెట్ క్లబ్‌కు హోం గ్రౌండ్. ఈ క్లబ్‌తో ఫారూక్ ఇంజినీర్, క్లైవ్ లాయిడ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. ఫారూక్ ఇంజినీర్ లాంకషైర్ తరఫున 1968 1976 మధ్య 175 మ్యాచ్‌లు ఆడి 5,942 పరుగులు చేశాడు. క్లైవ్ లాయిడ్ రెండు దశాబ్దాల పాటు లాంకషైర్‌కు ప్రాతినిధ్యం వహించాడు. వీరి సేవలకు గుర్తుగా ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో స్టాండ్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.





# మరో ప్రతిష్టాత్మక టోర్నీకి భారత్ ఆతిథ్యం

ఈ ఏడాది ప్రతిష్టాత్మక పురుషుల ఫిడే వరల్డ్ కప్‌కు భారత్ ఆతిథ్యమివ్వబోతోంది. ఈ విషయాన్ని ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్(ఫిడే) సోమవారం ప్రకటించింది. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 27 వరకు చెస్ ప్రపంచకప్ భారత్‌లో జరగనున్నట్టు తెలిపింది. ఈ టోర్నీలో టాప్3లో నిలిచిన ప్లేయర్లు వచ్చే ఏడాది జరగబోయే ఫిడే క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తారు. ఆ టైటిల్ విన్నర్ ప్రస్తుతం వరల్డ్ చాంపియన్ డి.గుకేశ్‌తో వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్2026లో తలపడతాడు. వరల్డ్ కప్‌లో 206 మంది ప్లేయర్లు పాల్గొంటారు. ఈ టోర్నీ నాకౌట్ ఫార్మాట్‌లో జరుగుతుంది. 8 నాకౌట్ రౌండ్లలో ప్లేయర్లు పోటీపడతారు. ప్రతి రౌండ్‌లో ఓడిపోయిన ప్లేయర్లు ఎలిమినేట్ అవుతారు. ఇటీవల కాలంలో భారత్ మేజర్ చెస్ ఈవెంట్లు జరిగాయి. 2022లో చెస్ ఒలింపియాడ్, గతేడాది టాటా స్టీల్ చెస్, వరల్డ్ జూనియర్ అండర్20 చాంపియన్‌షిప్ భారత్‌లో నిర్వహించగా.. ఈ ఏడాది ఏప్రిల్‌లో మహిళల గ్రాండ్ ప్రిక్స్ టోర్నీకి ఆతిథ్యమిచ్చింది.

# అదర గొట్టిన సిక్కోలు సిన్నోడు..

**ఏషియన్ వాలీబాల్ టోర్నీలో కాంస్య పతకం సాధించిన అట్టాడ చరణ్**
**థాయ్‌లాండ్‌లో జరిగిన పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన భారత్**
**అభినందించిన వాలీబాల్ సంఘ నాయకులు, క్రీడాకారులు**

**శ్రీకాకుళం న్యూకాలనీ:** పలాస మండలం అంతరకుడ్డ గ్రామానికి చెందిన వాలీబాల్ కుర్రాడు అట్టాడ చరణ్ అదరగొట్టాడు. అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన మొదటి టోర్నీలోనే జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి కాంస్య పతకం సాధించి శభాష్ అనిపించాడు. ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు థాయిలాండ్ వేదికగా ప్రతిష్టాత్మక 2వ ఏషియన్ అండర్ -16(మెన్) వాలీబాల్ చాంపియన్‌షిప్ -2025 పోటీలు జరిగాయి. ఇందులో త్రుటిలో ఫైనల్ బెర్త్‌ను కోల్పోయిన భారత జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. భారత జట్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించిన సిక్కోలు క్రీడాతేజం చరణ్ కాంస్య పతకం సాధించాడు. జట్టు విజయంలో కీలకభూమిక వహించిన చరణ్ ప్రతిభను జట్టు యాజమాన్యం, ఇండియన్ వాలీబాల్ ఫెడరేషన్ ప్రసంశించింది. అంతకుముందు ఈ నెల 10వ తేదీ వరకు బెంగళూరు వేదికగా ఎన్.ఎస్.ఎస్.సి. అకాడమీలో జరిగిన శిక్షణా శిబిరాల్లో మంచి క్రమశిక్షణతోపాటు అత్యుత్తమ ఆటతీరుతో సెలక్టర్లను ఆకట్టుకున్నాడు.

**అంతరకుడ్డ నుంచి అంతర్జాతీయ పోటీలకు..**

చరణ్ తల్లిదండ్రులు అట్టాడ కమల్‌నాదమ్, దేవి. వీరిది వ్యవసాయ కుటుంబం. చరణ్ విశాఖపట్నంలోని అక్కయ్యపాలెంలో ఉన్న సాయ్ స్పోర్ట్స్ స్కూల్/హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి పూర్తిచేశాడు. ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం పొందనున్నాడు. అన్నయ్య భార్గవ్ ఇంజనీరింగ్ ఫస్టియర్ చదువుతున్నాడు. మావయ్య రవి ప్రేరణ.. కోచ్ సత్యనారాయణ ప్రోత్సాహంతో రాణించగలుగుతున్నానని చెబుతున్నాడు. 2025లో ఢిల్లీలో జరిగిన సీబీఎస్సీ నేషనల్స్ వాలీబాల్ స్కూల్‌గేమ్స్‌లో కాంస్య పతకం సాధించగా, గత ఏడాది 2024లో జార్ఖండ్‌లో జరిగిన సీబీఎస్సీ నేషనల్స్‌లో ప్రాతినిధ్యం వహించి సత్తాచాటాడు.



**అభినందనల వెల్లువ..**

సిక్కోలు నుంచి ఏషియన్ వాలీబాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా కాంస్య పతకం సాధించడం పట్ల క్రీడావర్గాల్లో సర్వాత్రా హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ప్రత్యేకంగా మెచ్చుకున్నారు.వాలీబాల్ జిల్లా కార్యదర్శి కె.రామచంద్రుడు, ఉపాధ్యాక్షులు వై.పోలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్వీ రమణ, టి.రవి, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, బి.సతీష్, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, కోచ్ కె.హరికృష్ణ, వాలీబాల్ సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

**సంతోషంగా ఉంది..**

అంతర్జాతీయ ఏషియన్ వాలీబాల్ మీట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణంగా ఉంది. అందులోను మెడల్ సాధించడం సంతోషంగా ఉంది. సీనియర్ నేషనల్స్ ఆడి దేశానికి రిప్రజెంట్ చేయాలనేది నా కళ. ఇందుకు అహర్నిశలు కృషి చేస్తా.

# బీసీసీఐ స్టాండ్.. పాక్ 'ఆర్థిక' ఆశలకు భారీ గండి తప్పదా?

**ఆసియా కప్ 2025 టోర్నీ నిర్వహణపై ఏసీసీ ఓ నిర్ణయానికి రాలేదు. మరోవైపు భారత ప్రభుత్వ ప్రకటనతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కాస్త సంతోషపడేలోపే.. బీసీసీఐ ఓ బాంబు పేల్చింది. అదే సమయంలో నిన్న మాజీ క్రికెటర్ల మ్యాచ్ కూడా రద్దు కావడం పాక్‌ను భీతిల్లే పరిస్థితికి తీసుకొచ్చింది. ఇది తమ ఆదాయంపై భారీ దెబ్బ పడేలా ఉందని అక్కడి క్రికెట్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.**




పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్థాన్ మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే, కేంద్రమంత్రి మాన్‌సుఖ్ మాండవీయా మాత్రం 'అంతర్జాతీయ వేదికలపై భారత్ పాక్ తలపడే క్రీడలకు ఎటువంటి ఇబ్బంది ఉండదు' అని ప్రకటించారు. దీంతో ఆసియా కప్ నిర్వహణ సాధ్యమవుతుందని పాక్ భావించింది. ఈ టోర్నీ నుంచి రూ. 34.8 కోట్లు ఆర్జించొచ్చని సంతోష పడింది. ఇక్కడే ఆ బోర్డుకు షాక్ తగిలింది.

భారత కేంద్ర మంత్రి ప్రకటన చేసి రెండు రోజులు కూడా గడవకముందే బీసీసీఐ ఓ క్లారిటీ ఇచ్చింది. తాము పాకిస్థాన్‌తో ఎలాంటి క్రికెట్ ఆడేది లేదని పేర్కొంది. ఢాకా వేదికగా ఏసీసీ సమావేశానికీ తాము హాజరు కాబోమని.. వేదికను మార్చాల్సిందేనని ఇప్పటికే పట్టుబట్టింది. ఏసీసీ అధ్యక్షుడిగా ఉన్న పాక్ మంత్రి మోసిన్ నక్వీ మాత్రం సానుకూలంగా స్పందించలేదు. దీంతో జులై 24న జరగబోయే మీటింగ్‌లో ఎలాంటి తీర్మానం చేసినా బీసీసీఐ తిరస్కరించడం ఖాయం. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్‌లో ఆసియా కప్ జరగాల్సి ఉంది. భారత్‌వే ఆతిథ్య హక్కులు కావడంతో పాకిస్థాన్‌కు ఎటూ పాలుపోని పరిస్థితి. ఒకవేళ హోస్ట్‌గా వేరే దేశానికి కేటాయించినా.. భారత్ పాక్ మధ్య మ్యాచ్ లేకపోతే ఆర్థికంగానూ నష్టాలు తప్పవు. వీటన్నింటికీ ఓ స్పష్టత రావాలంటే వచ్చే గురువారం ఏసీసీ మీటింగ్ వరకూ ఆగాల్సిందే.